# లైబ్రరీలో లవ్ ఎఫైర్స్

సాయంత్రం కొత్త పెళ్ళి కూతురిలా తల దించుకుంది!

శైలజ కాలేజీనుంచి వచ్చాక, శుచిగా స్నానం చేసి — నెమలికంఠంరంగు సాటిన్ పరికిణి మబ్బురం మైసూరు సిల్కు జాకెట్టు, గులాబీ రంగు నైలాన్ వోణి ధరించి, మేడ రెండో అంతస్థులో హాలు బయట పడక కుర్చీలో కూర్చుని, ఆరోజు కాలేజీ లైబ్రరీలో తీసిన పుస్తకాలు తిరగవేయ నారంభించింది.

సాయంత్రపు చక్కని ఎండకు ఎదురింటి తెల్లని గోడలు స్వాగతం చెబుతున్నాయి, గార్డెన్‌లోని పూల మొక్కలు సంతోషం ప్రకటిస్తున్నాయి.

ఒకలావుపాటి పుస్తకం తిరుగ వేస్తూ — శైలజ హటాత్తుగా ఆశ్చర్య చకితు రాలైంది. ఆపుస్తకంలో అడ్రసులేని ఒక ప్రేమలేఖ ఆమె కంట బడింది. అందులో ఇలా వ్రాసి ఉంది.

'రేపు సాయంత్రం సరీగా ఆరుగంటల నలభై అయిదు నిముషాలకు నువ్వు బీచి' ఒడ్డుకు రావాలి. కళ్ళల్లో కొవ్వొత్తులు వెలిగించుకొని హృదయంలో ఆశాజ్యోతికి ఆముదాన్ని అర్పిస్తూ నీకోసం నిముషాలకు నమస్కారాలు చేస్తూ వుంటాను. మన ప్రేమ పరిణామం ఏదశతో వుందో ఎరుక పర్చుకొని మన ఇద్దరి పెళ్ళికిగల అవకాశాలను స్వేచ్ఛగా చర్చించు కుందాము. నేను నీకొరకు బీచి ఒడ్డున — మూడు నీలి రంగు దీపాల స్తంభం కింద మునీశ్వరుడనై తపస్సు చేస్తూ వుంటాను. నువ్వు తప్పక రావాలి'.

నీటిలో గులకరాయి మునిగినంత నిశ్శబ్దంగా నవ్వుకుంది. బి. ఏ. చదువుతూన్న శైలజ.

ఈ ప్రేమలేఖ యీ లైబ్రరీ గ్రంథంలో ఎందుకున్నది? ఎవరైనా, ఎవరికోసమైనా వ్రాసి మర్చిపోయి యిందులో పెట్టారా? లేక, వాళ్ళిద్దరూ లైబ్రరీ పుస్తకాలద్వారా ప్రేమలేఖల రవాణా ఏర్పాటు చేసికొన్నారా! అంతే జరిగి వుంటుంది. ఖర్మగాలి. తనకి ఇవాళ యీ పుస్తకంమీదే మోజు పోవాలి. పాపం! ఆ ప్రియుడు తన ప్రేయసి యీ పుస్తకం తీసికుంటుందని వూహించి, రేపు తప్పకుండా బీచి ఒడ్డుకు తనని కల్సి కొనేందుకు ఒస్తుందని స్వర్గానికి మెట్లులేని నిచ్చెనలు వేస్తూ వుంటాడు కాని ఆమె ఏందుచేతనో పుస్తకం తీసికోవటంలో ఆలస్యం చేసింది. అనివార్య కారణాల వల్ల బహుశా యీ రోజు కాలేజీకే రాలేక పోయిందేమో! ఇప్పుడు తనేం చేయాలి? ఆ ప్రశ్న తనలో ఉదయించే అగత్య మేముంది? ఆ ప్రేమ వ్యవహారంలో పానకంలో పుడక రీతిగా తనకి జోక్యం ఎందుకు? రేపు కాకుంటే మరో రోజు కల్సుకుంటారు. తను ఏమీ ఎరగనట్టు యీ పుస్తకాన్ని రేపు కాలేజీ లైబ్రరీలో యిస్తే సరి! అంతేనా? అట్లా చేయటం బుద్ధి మంతుల లక్షణం! కాని అట్లా గప్ చిప్‌గా వుండటంవల్ల — సంఘటనలో చలనం ఏముంటుంది? తను వాళ్ళ ప్రణయ సీమలో అడుగు పెట్టాలి. వాళ్ళ ప్రేమ వ్యవహారంలకి జోక్యం కలిగించు కోవాలి. అప్పుడు పరిస్థితు లెట్లా మారు తుంటాయో పరికించాలి. అదే తనకు కాలక్షేపం! వాళ్ళిద్దరూ తన కాలేజీ స్టూడెంట్స్ అయి వుంటారు. ఎవరో! రేపు తెలుస్తుందిగా — ఆ ప్రణయ స్వరూపు డెవరో!

ఆరాత్రికూడా శైలజ ఆ ప్రేమలేఖని గురించీ ఆ ప్రేయసీ ప్రియుళ్ళను గురించీ, రేపటి కార్యక్రమాన్ని గురించీ — చాలా సేపటి వరకూ ఆలోచించింది. మొత్తంమీద అర్ధ రాత్రికి అరగంట ముందే దృఢమైన నిర్ణయానికొచ్చి, ఆతర్వాత పట్టుపరుపుమీద

## తాళ్లూరు నాగేశ్వరరావు

బూరుగుదూది మెత్తటి దిండును కౌగిలించుకొని — మరునాడు ఉదయం కిటికీలోంచి సూర్యకిరణాలు దూసుకువచ్చి కను రెప్పల నునుపును తాకేవరకూ శైలజ నిద్రనుంచి లేవలేదు

ఆ ఇంటికి శైలజ ఒక్కగా నొక్క కూతురు కావడంవల్ల బహు గారాబంగా పెరిగింది. చిన్నప్పటినుంచీ శైలజ తండ్రి వ్యాపారంలో ల' కారం పలికిస్తూ, ఆమెకు పూర్తి స్వేచ్ఛ నివ్వడమే కాకుండా, విలాసాలకూ, వినోదాలకూ కాలేజీ చదువుకు, ఎందుకు' అన్న ప్రశ్న వేయ కుండా డబ్బు సప్లయి చేస్తూ వుంటాడు. బాల్యంనుండీ శైలజది ధైర్యసాహసాలకు నెలవైన బుర్ర. జీవితంలో ఎప్పుడోకాని తటస్థ పడని సంఘటనల పట్ల ఆమెకు అమితమైన అభిలాష, ఇంటరెస్టు, మోజు'! అల్లాంటి సమయాల్లో ఎటువంటి క్లిష్ట పరిస్థితులోకూడా ఎదుర్కొనే నేర్పూ, సామర్థ్యమూ — ఆమెలో ఉన్నాయి.

మరునాడు సాయంకాలం ప్రేమలేఖలో లిఖించి నట్లుగానే శైలజ మంచి దీటుగా అలంకరించుకుని బీచి ఒడ్డుకు వెళ్ళింది. శైలజ సౌందర్యం — ఎత్తునుంచి పడే జలపాతమూ, చెట్టునవున్న మల్లెపువ్వుల సువాసనా, పచ్చిక బయళ్ళమీద పచార్లు చేసే ఎండ మావుల శోభ — వలె సహజమైనదికాదు, ఆమె అందం ఎక్కువభాగం, యార్డ్లీ పౌడరు, పాండ్స్‌స్నో రాళ్ళనెక్‌లెస్, విలువైన దుస్తులూ', ఆకర్షణీయమైన తలకట్టూ — వల్ల ద్విగుణీకృత మైనదే! ఆమె అందానికి రాణింపు నిజంగా ఆమె నేత్రాలే! ఆనేత్రాల్లో — మగవాడి హృదయానికి సేరుగాక్లోరోఫారం తగిలించే శక్తి ఉన్నది. కాని చింతించవల్సిన విషయం ఏమంటంటే, శైలజ తనలోని ఆ గొప్ప ఆకర్షణ గుర్తించలేదు.

సరీగా సాయంత్రం ఆరుగంటల నలభై అయిదు నిముషాలకు శైలజ బీచిలో మూడు' నీలిరంగు దీపాల స్థంభందగ్గరకు వెళ్ళింది. కొంచెందూరాన్నుంచే — ఆస్తంభం కింద తపస్సు చేస్తూన్న ప్రేమ పక్షిని తిలకించింది. పాలమీగడలాంటి ఫారిన్ సిల్కు బుష్‌షర్టూ సిమ్మెంటు రంగు గాబర్డిన్ ప్యాంటూ ధరించి, దేవ్ ఆనంద్ తలకట్టు స్టైలులో క్రాపింగు సరిదిద్దుకొని — నవీన నాగరితలకు నిదర్శనంగా నిల్చిన ఆయువకుడు ఆమె లేత హృదయములో రబ్బర్‌స్టాంపు ముద్రలాగ హత్తుకొని పోయాడు. ప్రథమ వీక్షణంలోనే — అతని అంద చందాలను అంచనావేసి, టాయిలెట్ బాక్సులో పౌడరు డబ్బాని అదుముకున్నట్టుగా మనస్సులో అదుము కుంది.

అబ్బా! ఎంత బావున్నాడు?'' అన్నుకున్నాయి పేశలత్వం పుణికి పుచ్చుకున్న పెదవులు నీలిరంగు కాంతికింద నిలబడి అతనుచుట్టూ చూస్తున్నాడు — మనస్సులోని మొగలిపువ్వు కోసం.

అతనిచెంతకు పోవటానికి శైలజకాళ్లు అనుమతిన్నాన్ని దయచేయలేదు. అతనితో మాట్లాడేందుకు మనస్సు సిగ్గుతో ఎదురు తిరిగింది. అతను తనకేసి చూడమని — ఆమెమనస్సులో దీనంగా దరఖాస్తు పెట్టుకున్నది. 'నా ఆఫీసులో ఇప్పుడేం ఉద్యోగాలు లేవు' అని అధికారి ఆఫీసుచుట్టూ మూగిన నిరుద్యోగుల్ని నిర్దాక్షిణ్యంగా చీత్కరించినట్టుగా, అతను తననికూడా చీత్కారిస్తాడేమోనని భయపడింది శైలజ.

కాని అతను ఆమెకేసి చూశాడు.

అతను ఆమెకేసి చూస్తున్నప్పుడు — ఆమె ఒళ్లు మొగ్గలు తొడిగింది, కళ్లు సిగ్గుతెరల్లో ఇరుక్కున్నాయి, చెక్కిళ్లు చలిజ్వరం వచ్చినట్టుగా ఒణికాయి, పెదాలు పట్టుదప్పి ముడుచుకుపోయాయి. కాని ఆమెలోని యీభావ విప

# రచయితలకు మనవి

1. రచనలు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదకునికి పంపించవలెను. అంతేగాని వ్యక్తుల పేరిట పంపరాదు.

2. రచనలు పావుటావు కాగితాలమీదగానీ, అరటావు కాగితాల మీదగానీ, ఒకేప్రక్క స్పష్టంగా, సిరాతో వ్రాయాలి.

3. చిత్రాలు ఇండియన్ ఇంక్‌లో డ్రాయింగ్ పేపర్‌పైగానీ వాటర్‌మన్ పేపర్‌పైగాని, వేయాలి.

4. ఫొటోలు పెద్దవిగా వుండి ఒక ప్రత్యేక విశిష్టతను చూపేటివిగా వుండాలి. లేదా కళాత్మకంగానైనా వుండాలి.

5. మాకు పంపబడే రచనలు, ఫొటోలు, చిత్రాలు పరిశీలించుటకు నాలుగైదువారాల గడువు అవసరం. ప్రచురణార్హమైతే ఆ విషయం తెలియజేయబడుతుంది.

6. రచనలు వగైరాలు ప్రచురణకు అంగీకరింపబడని పక్షంలో త్రిప్పి పంపుటకు తగినన్ని తపాలాబిళ్ళలు, రచనలతో జతపరచాలి. కనీసం బుక్‌పోస్టు ఛార్జీ 8 న. పై.

ప్రమదావనం శీర్షికకు పంపే వుత్తరాలు, రచనలు, డిజైనులు వగైరాలు ప్రమదావనం, ఆంధ్రప్రభ, సచిత్ర వారపత్రిక విజయవాడ—2. అనే చిరునామాకు పంపవలసి వుంటుంది.

— ఎడిటర్.

వాన్ని అతను గుర్తింపలేదు. తన ప్రియురాలి రాక కోసం — పిచ్చిగా ఎదురుచూస్తూ, కాకతాళీయంగా — ఆమెవేపు చూశాడు! అంతే! అతని చూపు వెనుక కోర్కె గోడకట్టుకోలేదు.

శైలజ హృదయం — రాతిని తాకిన నీటిఅలలాగైంది. అతని మనస్సుకు బేడీలు తన అందంలో వేద్దామనే ఆవేశంతో వచ్చిన ఆమె అందాన్ని అతను [illegible] త్రుణీకరించటం జరిగింది. అంతకంటె అవజ్ఞ ఏముంది — తన సౌందర్యం మగవాడిగుండెకు గాలమని గర్వించే కన్యకు?

అతని ప్రేయసి రాలేదు.

అతనిలో నిట్టూర్పులు బుసలుపెట్టినయ్. నిరాశ ముఖాన్ని చిటపటలాడించింది. ఏడుగంటలపైన పది నిముషాలకు 'ఆమె ఇంకరాదు' అని మనస్సులో కన్నీళ్ళు కార్చాడు. ఆతర్వాత కొలది నిముషాలకే అతను ప్యాంట్‌జేబుల్లో అరచేతులు పెట్టుకొని, ఎంబాసెడర్‌బూటుతో ఇసుక రేణువుల్ని కసిగా తన్నుకుంటూ, పెదాలను కొరుక్కుంటూ, ప్రాపింగు ముక్కును అంటుకోవాలని తహతహలాడుతూండగా — ఇంటిముఖం పట్టాడు.

కొండచివర ఎక్కికూర్చున్న ఆశలు కొండ క్రిందికిదిగిరాగా — శైలజదిగాలుపడ్డముఖంతో ఇల్లు చేరుకుంది. అతనిదృష్టిని బంధింపలేని — తన సౌందర్యంమీద ఆమెకెంతో అలుక ఏర్పడింది. నిలువుటద్దమూ, రాళ్ళనెక్‌లెస్, ఏంజెల్సు పౌడరూ, షిఫాన్ చీరా — ఆక్షణంలో అన్నీ శత్రువులై, వెక్కిరించినట్టుగా తోచినయ్.

కాని ఆమె అంతటితో మనస్సుపై చల్లని నీళ్ళు చల్లుకోలేదు. మెర్క్యురీ లైటుకాంతిలా కోర్కె వెలుగుతూంటే — పురుగులు ముసిరినట్టుగా ఆలోచనలు ముసిరినయ్. అందులో ఒకఆలోచన చీకట్లోఅగ్గిపుల్లవెలిగించినట్టుగా— మనస్సులో వెలిగింది. వెంటనే టేబుల్‌ముందు కూర్చుని తెల్లని కాగితంమీద ఇలా వ్రాసింది :

'—నిన్న మీలేఖప్రకారం మిమ్మల్ని కల్సుకోలేనందుకు లక్షక్షమాపణల్ని చెప్పుకుంటున్నాను. అవకాశాలన్నీ జారిపోయి—పరిస్థితులు ప్రమాదభరితాలై త్రాచుపాముల్లా కాళ్ళకు చుట్టుకోగా, మిమ్మల్ని నిరాశతో నిలబెట్టాల్సి వచ్చింది. రేపు మీరు తప్పకుండా సాయంత్రం ఆరుగంటలసలబై అయిదు నిముషాలకు పార్కులోకి రావాల్సింది. పార్కులోని రీడింగురూమ్ వెనుకగల ఫౌంటెన్ ముందు బెంచీమీద నేను మీకోసం మనస్సంతా కళ్ళుచేసికొని ఎదురుచూస్తూవుంటాను. మన ప్రేమపురాణంలో పుటలు పెంచుదాం. తప్పకుండా వస్తారుగదూ! !'

శైలజ ఆలేఖను ఆలైబ్రరీ పుస్తకంలో పెట్టి, ఆపుస్తకాన్ని మరునాడు లైబ్రరీలో యథాస్థానంలో పెట్టింది.

* * *

అమరుసటిరోజు శైలజ మధ్యాహ్నం కాలేజీకి వెళ్ళడం మానివేసి — పెళ్ళిచూపులకోసం తయారైన పెళ్ళికాని పిల్లలాగ తయారై, సాయంత్రం ఆరుగంటలసలబై అయిదు నిముషాలకు పార్కులోని రీడింగురూమ్ వెనుకగల ఫౌంటెన్‌ముందు బెంచీమీద విరహోత్కంఠితలాగ ఎదురుచూడనారంభించింది.

మునిమాపు ముందడుగు వేయుటంతో — పార్కులోని విద్యుద్దీపాలు పరిపాలన మొదలెట్టాయి. ఆకాంతిలో పార్కులోని పూలచెట్లు — కల్యాణమంటపంచుట్టూ చేరిన ముత్తైదువుల వలె కళకళలాడినయ్.

పార్కుబెంచీమీద పచ్చలైటుక్రింద అందమైన పిల్ల కూర్చొని ఉండటం — ఆపార్కులో ఒక పండుగలాగైంది. అందరిచూపులూ ఆమెమీదాయి, అందరి హృదయాలూ ఒక్కలాగే చలించాయి, అందరూ ఆమె కూర్చున్నబెంచీమీదుగానే గాలి పీల్చుకున్నారు.

లేఖలో లిఖించిన పుణ్యకాలం జరిగిపోయింది. కాని ఆమె కోరిన ప్రియుడు రాలేదు.

శైలజ విప్రలబ్ధయైనది.

శీతాకాలం సీసాలోని కొబ్బరినూనె చలికి గడ్డకట్టుకుపోయినట్టుగా — నిరాశతో ఆమెముఖం బిగుసుకుపోయింది. తెలుపూ నీలంమధ్య ఎరుపుకు మల్లే — ఏడుపూ, నవ్వుకూమధ్య కోపం ఆమెలో ద్యోతకమవుతూంది. అతను రాలేదేఅన్న అవమానమూ, తను పరాయి పురుషుడికోసం పెళ్ళి లేని వయస్సులో పరితపించవలసివచ్చిన అభిమానమూ, తను సిగ్గుగా వెళ్ళిపోయిందేమోనన్న ఆవేశమూ — ఆమెను బెంచీమీద కూర్చోబెట్టిన బొమ్మలాగ మార్చాయి.

కొలనుకొండరాయిలాంటిముఖంగల ఒకయువకుడు ముందు మూడుసార్లు నడిచి అందాన్ని చాటుతూవుండగా, లొక్కాకాలరు మాటిమాటికీ సర్దుకుంటూ, ఇసుకకణ్ణాలాంటి కోర్కెల్ని కళ్ళలో కనబరుస్తూ — పదేపదే ఆమెకూర్చున్న పార్కు బెంచిచుట్టూ ప్రదక్షిణాలు చేయనారంభించాడు. అతన్ని మొదట్లో గమనించకపోయినా —కొంతసేపటికి అతనెందుకు అట్లా వికారాలు పొందుతున్నాడో శైలజ గ్రహించింది. వెంటనే ఆమెముఖం ఓవర్ ఎక్స్‌పోజుడు ఫోటోలాగైంది.

ఎంతఘోరం జరిగింది? తను యింతమున్నుబడి వ్రాసినలేఖప్రేమ కోరిన ప్రియుడికి చేరలేదు. నిన్న ఆలేఖను ఆపుస్తకంలోంచి యాత్రబుద్ధుడు కాలేజీ లైబ్రరీలో కాజేశాడన్నమాట. ఖర్మగాలి ఆపుస్తకం యూపక్షేంద్రుని పాలిట పడాలి! అపచారం జరిగిపోయింది. తన ఎత్తు కుదరలేదు. ప్రణయ జీవితంలో పెట్టుకున్న ఆశలు క్రుంగిపోయినయ్. ఇప్పుడేం చేయాలి! ఈ పబ్లిక్ పార్కులో, ఇంతమంది మనుషులు తిరిగే సందడిలో ఆతను సాహసించి తనసరసన

కూర్చుని సరాగాలు మొదలెట్టడుగదా! చి. చీ. తను వేసుకున్నప్లాను ప్రమాదానికి దారితీసింది. ఈ ప్రమాదాన్నుంచి పరువుగా బయటపడే సులభ మార్గమేమిటి? అతను ఏసాహసానికీ దిగకముందే ఇక్కణ్ణుంచి పారిపోవటమే మేలు — అనుకున్నదై శైలజ పార్కు బెంచీమీద గండుచీమ కుట్టినట్టుగా లేచింది.

సెక్సు పత్రికల్లో చాటుగా బొమ్మలుచూసి కొని స్త్రీమీద వాంఛని పెటుతరం చేసికొన్న ఆ కొలను కొండరాయిలాంటి యువకుడు ఆమె కెదురుగా నిలిచాడు. చిరునవ్వుల వలలను ఎత్తి పట్టుకొని.

శైలజలో పిచ్చిధైర్యం హెచ్చుకాగా, ఉక్రోశం రెచ్చిపోగా, ముఖంప్రక్కగాపెట్టి — పరుగెత్తింది పార్కుబైటకు. అంతవరకూ ఆయువకుడు నిస్సిగ్గుగా వెంటబడ్డాడు. ఆపైన శైలజ సిటీబస్సు అందుకొని — ఏడుకొండల వెంకన్నను ఏడువాట్లు తలుచుకుంది.

కొలనుకొండరాయి రోడ్డుప్రక్క మైలురాయిలాగ నిలబడిపోయింది.

శైలజ ఇంటికెళ్లి మూడుగ్లాసుల మంచినీళ్లు త్రాగి — 'ఇట్లాంటి బుద్ధితక్కువపనికి పోయి — ప్రమాదంలో ఎప్పుడూ ఇరుక్కోరాదు' అనుకుంది.

* * *

ఆమరునాడు పగలు పన్నెండు గంటలప్రాంతాన కాలేజీ ప్రిన్సిపాలు ఏదో పుస్తకంకోసం కాలేజి లైబ్రరీ అంతా కసిగా తిరుగవేస్తూవుండగా ఒక లావుపాటి పుస్తకంలోంచి ఒక ప్రేమలేఖ జారి క్రిందబడింది. ఆలేఖనుతీసి ఆయన సొంతం చదువుకున్నాడు. అందులో ఇలా వ్రాసిఉంది:

'—అత్యవసర పరిస్థితులు గొంతుమీద తన్ని వేసికొని, పూపిరిసలుపనివ్వకపోవడంవల్ల — నిన్న పార్కుకు నువ్వు ఆహ్వానించిన ప్రకారం రాజాలకపోయాను. ఈ దీనుడిక్షమాపణల్ని అంగీకరించవలయును. రేపు సాయంత్రం ఆరుగంటల ఇరవై నిముషములకు నువ్వు తప్పకుండా ప్లాజాథియేటర్‌కు రావాలి. సినిమా కులాసాగాచూస్తూ, ఎన్ని ప్రేమవిషయాలనైనా ఖుషీగా మాట్లాడుకుందాం. ప్లాజా థియేటర్‌గేటువద్ద పొగాకురంగు ఉలెన్ ఫ్యాంటూ, వైట్ షార్క్‌స్కిన్ బుష్‌షర్టూ వేసికొని — నీకోసం ప్రతి నిముషమూ ఒక యుగముగా నిరీక్షిస్తూ వుంటాను. తప్పకుండారావాలి.

ఆలేఖ చదవగానే ప్రిన్సిపాలుగారి కనుబొమలు ఎగిరి గంతేశాయి. ఆయన కళ్లజోడు పైకీ క్రిందికీ కదులాడింది. క్రిందిపెదాన్ని పైపంటితో నొక్కిపట్టి — ఎంత విపరీతం? కాలేజీ లైబ్రరీలో లవ్ ఎఫెయిర్సా? లైబ్రరీ పుస్తకాలు లవ్ లెటర్సు మార్పిడికి ఉపయోగపడుతున్నాయా? చి. చీ. విద్యార్థిలోకం ఎంత నీచస్థితికి దిగజారింది. శ్రద్ధగా చదివి, పరీక్షల్లో ఫస్టుమార్కులు తెచ్చుకుందామనే పట్టుదల ఒక్కడికీ ఉంటేనా? కాలేజీ ఆవరణలో అడుగెట్టగానే వీళ్లకు ప్రేమగాలి ఆవరిస్తుంది. చూడగా చూడగా కాలేజీలు లవ్ ఎఫెయిర్స్‌కు నిలయాలుగానీ, విద్యానిలయాలుకావు. అందమైన ఆమ్మాయిని చూడగానే ప్రతి విద్యార్థి హృదయంలోనూ కోర్కెలు లతలుగాసాగి పువ్వులుగా పరిణమిస్తాయి. ఆపువ్వుల్ని మాలగా అల్లి ఆఅమ్మాయి మెడలో అలంకరించాలని తహతహ. తాను ఇంటిదగ్గర తండ్రి సంపాదనమీద చదువు చదువుతున్నాడు, ఆచదువుకు న్యాయం చేకూర్చాలి, ఇప్పుడు బాగా చదివి పరీక్షల్లో ఫస్టుమార్కులు తెచ్చుకుంటేనా — భవిష్యత్తులో గొప్ప ఉద్యోగాన్ని సంపాదించుకోగలుగుతాడు. ఆపైన జీవితం సుఖంగా వెళ్లమారుతుంది — అనేముందు ఆలోచన ఒక్కళ్లకున్నదీ! పాపం. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో, ఆశయాలతో డబ్బు ఖర్చుపడి కాలేజీలకు పంపిస్తే — వీళ్లు ఇక్కడ పలుపుతాడ తెంపుకున్న కోడెదూడల్లాగ విచ్చలవిడిగా విహరిస్తూ, తమధర్మాన్ని కర్తవ్యాన్ని మర్చిపోతారు. ఇట్లాంటి విషయాలను ఎప్పటికప్పుడు ప్రతిఘటిస్తూ వుండాలి. ఎట్లాంటిపరిస్థితుల్లోనూ ఇట్లాంటి అల్లరిపనుల్ని సహించరాదు. ఈలేఖ వ్రాసిన ఆకతాయి వెధవ ఎవ్వరో కళ్లారాజూసి, వాళ్లకు సంకెళ్లు వేయాలి! ఎల్లుండి కాలేజీలో అడుగుపెట్టకుండా కొన్నాళ్లపాటు 'డిస్‌మిస్', చేయాలి. మొక్కనాటగానే, దానికిరోజూ నీళ్లు పోస్తూవుండాలి. అశ్రద్ధచేస్తే, అది కొన్నాళ్లకు ఎండిపోతుంది. ఎందుకూ పనికిరాకుండాపోతుంది. ఈ విద్యార్థులూ అంతే! వీళ్లను ఎప్పుడూ పర్యవేక్షిస్తూవుండాలి. ఎప్పటికప్పుడు, తప్పుచేసినప్పుడల్లా, నిర్దయగా దండించాలి. లేకుంటే యీవెధవలు పబ్లిక్ రోమాన్సు కాలేజీలో మొదలెడతారు. కాలేజీ అప్రతిష్ఠపాలవుతుంది. ఆవెధవ ఎంత ఉన్నత కుటుంబానికి చెందినవాడైనా, ఎంత ఆఫీసరు కొడుకైనా — రేపు సినిమాహాలుదగ్గరచూసి తగనచర్య తీసికోవాల్సిందే!— అట్లా ప్రిన్సిపాలుగారు గాఢంగా నిర్ణయించుకున్నారు.

ఆకాలేజీ ప్రిన్సిపాలు — డిసిప్లిన్ విషయంలో ఇనుపదూలంలాంటి మనిషి. కాలేజీలో అబ్బాయిలు అమ్మాయిలపైన ఎట్లాంటి పిచ్చిచేష్టలు చేయకుండా ఆయన ఎంతో జాగ్రత్తగా పరిపాలన సాగిస్తున్న సంగతి ఆనగర ప్రజలకు పెక్కు సంఘటనలద్వారా సువిదితము. ఒకసారి అమ్మాయిలు మేడమెట్లెక్కుతూన్నప్పుడు వీళ్లువెనుకే జఘన సౌందర్యాన్ని అంచనావేస్తూ నడుస్తున్న ముగ్గురబ్బాయిలకు ఆయన మూడువదులు ముప్పైరూపాయలు ఫైనుగా విధించాడు. ఇంకొకసారి క్లాసులో లెక్చరరు పాఠం చెబుతూండగా అమ్మాయిల బెంచీవెనుక బెంచీలో కూర్చున్న ఇద్దరు విద్యార్థులకు — అమ్మాయిల మెత్తని పాదాలను తమ మొద్దుపాదాలతో మొరటుగా నొక్కిన నేరానికి మూడుమాసాలు కాలేజీముఖం చూసేప్రాప్తంలేకుండా ఆయన శిక్ష విధించాడు. మరొకసారి ఒకఅమ్మాయి జడలోని గులాబిపువ్వు, నేర్పుగాతీసి, మూడుసార్లు ముద్దుపెట్టుకొని మళ్లీ ఆపువ్వును ఆఅమ్మాయిజడలో తురిమిన తప్పుకు — ఒవిద్యార్థికియాభైరూపాయలు జరిమానా విధించబడింది. అట్లాంటి విప్లవచర్యలు గతంలో ఆయన తీసికున్నాడు — అబ్బాయిల అల్లర్లను గురించి.

మరునాడు సాయంత్రం ఆరుగంటల ఇరవై నిముషాలకు ప్రిన్సిపాలుగారు ప్లాజాథియేటరు గేటుదగ్గరకు హాజరయ్యారు. ఆగేటుదగ్గర పొగాకురంగు ఉలెన్‌ప్యాంటు, వైట్ షార్క్‌స్కిన్ బుష్‌షర్టూ వేసికుని — ప్రియురాలి రాకకోసం నిముషం యుగముగా నిరీక్షిస్తున్న ఒక యువకుడు ఆయనకంటబడ్డాడు. అతన్ని చూడగానే ప్రిన్సిపాలుగారి ముఖం ఆశ్చర్యముగా, క్రోధభరితముగా, జుగుప్సతో — గంభీరమైంది.

అతను ప్రిన్సిపాలుగారి పెద్దకొడుకు.

'ఒరివెధవా! నువ్వట్రా! సైనరు వెళ్లిందో లేదో అప్పుడే ప్రియురాలు కావాల్సి వచ్చిందా? ఎప్పుడైనా! ఇంటర్‌మీడియేట్ ప్యాసుకావడానికి మూడేళ్లు పట్టిందిగాని ప్రేమవిషయాలు, ఖుషీగా మాట్లాడతావా? ఎంత హెచ్చిపోయావు?' అనుకున్నాడు ప్రిన్సిపాలు అబ్బాయిని చూసి.

తండ్రిని మూడుగజాలముందు చూసి — ఖడ్గమృగాన్నిచూసి పిల్లవాడు పరుగెత్తినట్టుగా, ఆయువకుడు పరుగెత్తాడు మనుష్యులమధ్యగా.

ప్రిన్సిపాలుగారు ప్లాజాథియేటరుముందు నిలబెట్టిన రాతి బొమ్మలా నిలబడిపోయారు.

